ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



యుజి సీట్ల భర్తీకి ఓపెన్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో మిగిలిన యుజి సీట్లను ఈ నెల ఆరో తేదిన ఓపెన్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వైస్ ఛాన్సలర్ తేజస్వి కట్టిమని తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన సియుఇటి(యుజి) పరీక్ష రాసిన వారు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో, అత్యున్నత విద్యా ప్రమాణాలు గలిగిన విద్య అందిస్తామని తెలిపారు. www.ctuap.ac.in వెబ్‌సైట్‌లో ఈ నెల ఐదో తేదిరాత్రి రాత్రి 11:55 గంటలలోపు అభ్యర్థులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ను లేదా ఫోన్ నెంబర్ 08922296033ను యూనివర్సిటీ పని వేళలలో సంప్రదించాలని కోరారు.



భోగాపురం మండలం ముక్కాం గ్రామంలో తీరానికి చేర్చిన బోట్లు

3 రోజులపాటు భారీవర్షాలు

అప్రమత్తంగా ఉండండి ● జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించిన కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డిఒలు, తహాశీల్దార్లతో తన ఛాంబర్ నుంచి శనివారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. అల్పపీడనం కళింగపట్నం వద్ద తీరం దాటుతుందని, ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారులు ఈ మూడు రోజులపాటు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లా స్థాయితోపాటు, డివిజన్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డిపిఒకు సూచించారు.

ఆసుపత్రుల్లో మందులు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ మూడు రోజులూ గ్రామాల్లోనే ఉండాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వైర్లు తెగిపడటం కారణంగా ఎక్కడా ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్‌డిఒలకు మరిన్ని సూచనలు చేశారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ (08922-236947) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జెసి సేతు మాధవన్ పాల్గొన్నారు.

తీరంలో అప్రమత్తం

భోగాపురం/పూసపాటిరేగ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా మూడో మూడు రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం తీర ప్రాంత గ్రామాలకు వెళ్లి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. భోగాపురం మండలంలోని సముద్రతీరాన ఉన్న ముక్కాం గ్రామానికి తహాశీల్దార్ ఎం.సురేష్ సిబ్బందితో వెళ్లి మత్స్యకారులతో మాట్లాడారు. భారీ వర్షాలు కారణంగా ఎవరూ వేటకు వెళ్లొద్దని సూచించారు. ప్రతి విఆర్‌ఒ ఆదివారం సెలవు అయినప్పటికీ కచ్చితంగా గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పూసపాటిరేగ తహాశీల్దార్ టి.గోవిందరావు తన సిబ్బందితో తీర గ్రామాలైన చింతపల్లి, బర్రిపేట, తిప్పలవలస, కోనాడలో పర్యటించారు. భారీ వర్షాలు నేపథ్యంలో తీరం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో రెండు రోజుల పాటు వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు సూచించారు. తీర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

తీరంలో ఎగసిపడుతున్న అలలు

శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం వద్ద తుపాను తీరం దాటుతుండడంతో సముద్రంలో భారీ ఎత్తున అలలు ఎగిసిపడుతున్నాయి. మత్స్యకారులు తమ వలలను, బోట్లను తీరానికి చేర్చారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పర్యటిస్తుండడంతో మత్స్యకారులు కూడా అప్రమత్తమవుతున్నారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

జిల్లాలో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పాటు, మండల కేంద్రాల్లో కూడా 24 గంటలూ పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు : 08922 236947
విజయనగరం డివిజన్ : 08922 276888
బొబ్బిలి డివిజన్ : 9390440932
చీపురుపల్లి డివిజన్ : 7382286268



భారీవర్షాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

పత్రికల్లో ప్రజాశక్తిది ప్రత్యేక స్థానం

● నిజాలను నిర్భయంగా రాస్తున్న ఏకైక పత్రిక
● 44వ వార్షికోత్సవ సభలో వక్తలు



ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డిపిఆర్‌ఒ డి.రమేష్, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి కృష్ణాజీ, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు తదితరులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నేటి సమాజంలో ఉన్న పత్రికల్లో ప్రజాశక్తికి ప్రత్యేక స్థానమని, నిజాలను నిర్భయంగా రాస్తున్న ఏకైక పత్రిక అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రజాశక్తి 44 వార్షికోత్సవ సభ శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రజాశక్తి సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.పోలినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు బాగు పడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. వారిని చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ44 ఏళ్ల పాటు నిరంతరాయంగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ప్రజలు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను మెరుగు పరచడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక పత్రిక ఉన్న నేటి రోజుల్లో ప్రజాశక్తికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో కూడా పత్రికలు కీలక పాత్ర పోషించాయి అని అన్నారు. పత్రికలు ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ పెట్టుబడిదారులు నిర్వహిస్తున్న దినపత్రికల మాదిరిగా ఆకర్షణీయంగా పేజీలు లేకపోయినా ప్రజాశక్తి దినపత్రికలో బడుగు, బలహీన వర్గాలు గిరిజనులు, అణగారిన వర్గాలు కార్మికులు, శ్రామికులు, కర్షకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లుగా తమ కథనాల ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి, పాఠకులను ఆలోచింపచేసే వార్తలు రాసే పత్రిక అని కొనియాడారు. ఇలాంటి పత్రికలకు ప్రజలే చేదోడు వాదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. డిపిఆర్ఒ ఎల్.రమేష్ మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావం, క్రమశిక్షణ, ఉదాత్తమైన ఆలోచనలు కలిగిన పాత్రికేయ సిబ్బందితో నేటికీ 44 ఏళ్ల పాటు పత్రిక మనగలడం ఈరోజుల్లో సాధ్యం కాని విషయమని, ఘనత ప్రజాశక్తికే చెల్లిందని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా దినపత్రికల్లో మార్పు వచ్చినప్పటికీ నీతి నిజాయితీతో పాటుగా పాత్రికేయ విలువలు పాటించడంలో ఎలాంటి మార్పు చెందకుండా ప్రజల పక్షాన నిలిచే పత్రికల్లో ఈ పత్రిక ముందు వరుసలో ఉంటుందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ వాస్తవాలను ప్రతిబింబిస్తూ, ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న ప్రజా సంఘాలకు గొంతుకై నిలిచి తమ కథనాలతో వాస్తవాలను ప్రచురిస్తూ అధికారులతో పాటు ప్రజలను ఆలోచింప చేయడంలో ప్రథమ స్థానం ప్రజాశక్తి దేనిని అన్నారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ కాలానుగుణ మార్పులతో 1981 నుండి ప్రజాశక్తి దినపత్రికగా సేవలు అందిస్తున్నప్పటికీ, వాస్తవానికి 1942 నుండి వామపక్ష భావాలతో పత్రికను వివిధ రూపాల్లో నడిపిస్తూ ప్రజా సమస్యలను వార్తల రూపంలో ప్రతిబింబించడం 84 ఏళ్ల క్రితమే బాధ్యతగా చేపట్టిందన్నారు. ప్రజాశక్తి మేనేజర్ సిహెచ్ రాము మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా ప్రజాశక్తి సిబ్బంది కలెక్టర్, ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పడాల రాజశేఖర్‌తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు సాహితీ అభిమానులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రచయిత గౌరినాయుడు

ప్రజాశక్తి జిల్లా కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని అగ్రహారంవీధిలో ప్రజాశక్తి కార్యాలయాన్ని శనివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, జి.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి రాజశేఖర్, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, మేనేజర్ సిహెచ్ రాము, పలు మండలాలకు చెందిన విలేకరులు పాల్గొన్నారు.



చెరువు మధ్య రోడ్డును తొలగిస్తున్న పొక్లెయినర్

చెరువులో రోడ్డు తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చెరువులను కాపాడంటూ శనివారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. కమిషనర్ నల్లనయ్య.. తహాశీల్దార్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులను కార్యాలయానికి పిలిపించి చెరువులో వేసిన రోడ్డును వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి టౌన్ ప్లానింగ్ టిపిఒ ఫిలిప్, ఆర్ఐ ఎస్ఎస్ఎస్ఎస్ రాజు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య మహంతి చెరువులో వేసిన రోడ్డును పొక్లెయినర్ సహాయంతో తవ్వి, మట్టిని లారీలో తరలించారు.

రైతులకు అవసరమైన ఎరువులు అందించాలి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ గోపాలం, బి.రాంబాబు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయని తెలిపారు. ఎరువులు చల్లేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పారు. దీంతో రైతు సేవా కేంద్రాలకు డిఎపి, యూరియా కోసం రైతులు వెళ్తే అనేక కేంద్రాల్లో దొరకడం లేదని తెలిపారు. ఎక్కువగా వినియోగించే డిఎపి ఎరువు అందుబాటులో లేదని చెప్పారు. ప్రయివేటు ఎరువుల దుకాణాల్లో రైతులు అవసరమైన ఎరువు కావాలంటే, ఇతర ఉత్పత్తులు బలవంతంగా అంటగడుతున్నారని తెలిపారు. యూరియాకు అదనపు ధర వసూలు చేస్తున్నారని వివరించారు. ఎరువులు సక్రమంగా అందించటంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఒకరోజు ముందే 'భరోసా'

ప్రజాశక్తి-బొండపల్లి

పేదలకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందురోజే ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. బొండపల్లి మండలం జియ్యన్నవలస గ్రామంలో శనివారం మంత్రి శ్రీనివాస్ పింఛన్లను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుడు చుక్క అప్పారావు పురిపాకలోకి వెళ్లి మరీ పింఛను అందించారు. ఇటీవలే ప్రమాదానికి గురై కాలు పోగొట్టుకున్న ఎర్ర శ్రీను కదల్లేని పరిస్థితిలో ఉంటే అతని పూరిగుడిసెలోకి వెళ్లి మరీ మొరవిన్నారు. ఆయనకు ప్రభుత్వం నుంచి సహకారాన్ని అందిస్తామని, పింఛను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తామని, అంతవరకు ప్రత్యామ్నాయ భవనంలో కేంద్రాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధిహామీ నిధులతో కాలువలను నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, తహాశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎసి రవికుమార్, ఎపిఎం సులోచన, గ్రామ కార్యదర్శి అప్పలరాజు, ఇతర మండలస్థాయి అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛను నగదు అందజేస్తున్న మంత్రి కొండపల్లి

పింఛన్ల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్

గుర్ల, గరివిడి, చీపురుపల్లి : గుర్ల, గరివిడి, చీపురుపల్లి మండలాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాల్గొన్నారు. గుర్లలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గరివిడి మండలం కొండపాలెంలో, చీపురుపల్లిలో పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. 10 గంటల్లోపు మొత్తం పంపిణీ జరగాలని ఎంపిడిఒలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లా కేంద్రానికి చేరుకొని డిఆర్‌డిఎలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా అంతటా చేపడుతున్న పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. 10 గంటలకే రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో విజయనగరం జిల్లా రెండో స్థానంలో ఉందని, మొదటి స్థానానికి వచ్చేలా చూడాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్ రాజా, గుర్ల ఎంపిడిఒ కళ్యాణి, తహాశీల్దార్ ఆదిలక్ష్మి, చీపురుపల్లి ఎంపిడిఒ రామకృష్ణరాజు, కంట్రోల్ రూమ్‌లో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎపిడి సావిత్రి, డిపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై నిష్పక్ష విచారణ

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన హిడెన్ కెమెరాల ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుడ్లవల్లేరు సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాల్సిన ప్రభుత్వం ఆ విధంగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. దాదాపుగా 300 మందికి పైగా విద్యార్థినుల వీడియోలు బయట తిరుగుతున్నాయని విద్యార్థులు గగ్గోలు పెడుతుంటే, దీనిపై దర్యాప్తు చేయాల్సిన పోలీసులు.. అసలు ఘటనే జరగలేదంటూ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ అంశంలో పూర్తి స్థాయిలో యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఈ అంశంలో ప్రభుత్వం చూడాల్సింది పార్టీలు కాదని, విద్యార్థుల భవిష్యత్తును, వారి ఆత్మాభిమానాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. విద్యార్థులను అణిచివేసే కుట్రలు ఆపాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లాలో కళాశాలలకు అనుబంధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా అనేక విద్యార్థినుల హాస్టళ్లు నిర్వహిస్తున్నారని, వీటిపై ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. వెంటనే ఈ హాస్టళ్లను తనిఖీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎయిర్‌పోర్టుకు మౌలిక వసతుల కల్పన వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం కోట

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మౌలిక వసతులను కల్పించే పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయానికి వసతుల కల్పన, భూ సేకరణ తదితర అంశాలపై తమ ఛాంబర్‌లో శనివారం కలెక్టర్ సమీక్షించారు. ఎయిర్‌పోర్టుకు నీటిని అందించేందుకు సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలన్నారు. సుమారు 25 కిలోమీటర్ల మేర నాలుగు కెనాల్స్‌ను తవ్వాల్సి ఉందన్నారు. దీనికి అంచనాలను త్వరగా తయారు చేయాలని ఆదేశించారు. ఇతర సమస్యలపైనా చర్చించారు. సమావేశంలో జెసి ఎస్.సేతు మాధవన్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఇరిగేషన్ ఇఇ సీతారామ్, ఇతర శాఖల అధికారులు, జిఎంఆర్ సిఇఒ మనోమే రాయ్, సిడిఒ ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాపాయం నుంచి రక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి రక్షణ పొందాలని ఎస్‌పి వకుల్ జిందాల్ కోరారు. విజయనగరం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించేందుకు శనివారం నగరంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వాహనాలు నడిపినప్పుడు విధిగా హెల్మెట్ ధరిస్తే, రోడ్డు ప్రమాదాలు జరిగినా చిన్న చిన్న గాయాలతో ప్రాణాలను రక్షించుకొనే పరిస్థితులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి గోవిందరావు, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్‌బి సిఐలు విజయనాథ్, ఎ.వి.లీలారావు, వన్,టుటౌన్ సిఐలు ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, మహిళా పిఎస్ సిఐ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

సంగీత కళాశాలలో హరికథకు స్థానమివ్వాలి

విజయనగరం కోట : ప్రభుత్వ సంగీత కళాశాలలో హరికథకు ప్రత్యేక స్థానం ఇవ్వాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రభుత్వాన్ని కోరారు. ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని గాంధీ పార్కులో ఆదిభట్ల విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ విజయనగరం ప్రభుత్వ సంగీత కళాశాలలో అదిభట్ల ప్రధాన ఆచార్యుడిగా పనిచేసిన కాలంలోనే కళాశాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అటువంటి కళాశాలలో హరికథకు స్థానం లేకపోవడం బాధాకరమన్నారు. అద్భుతమైన హరికథ కళని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, సహాయ కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్, పౌర వేదిక ఉపాధ్యక్షుడు రొంగలి పోతన్న పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

విజయనగరం టౌన్ : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా విజయనగరం జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో లంకాపట్నంలోని సామాజిక భవనంలో శనివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కేన్సర్ పరీక్షలు నిర్వహించి, కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 200 మంది వైద్య సేవలు పొందారు. జనసేన నాయకులు రౌతు కుమార్, త్యాడ రామకృష్ణారావు పాల్గొన్నారు.

కరాటేలో 'గురుదత్తా' విద్యార్థుల ప్రతిభ

విజయనగరం టౌన్ : స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన కరాటే పోటీలలో శ్రీ గురుదత్తా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో శివ గణేష్ కు బంగారు, పి.హేమంత్‌కు వెండి పతకాలు లభించాయి. శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీరిని, కోచ్ కె.సంతోష్‌కుమార్‌ను స్కూల్ డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పి.పద్మ ప్రశంసించారు.

ఎండిఆర్ వ్యవస్థ చట్ట విరుద్ధం

విజయనగరం కోట : ఎండిఆర్ వ్యవస్థ చట్ట విరుద్ధమని, డీలర్ వ్యవస్థకు పూర్వ వైభవం రాబోతుందని రాష్ట్ర డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దివి లీలా మాధవరావు అన్నారు. శనివారం నగరంలోని పింఛనుదారుల భవనంలో డీలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్ వ్యవస్థను గత వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజా పంపిణీ వ్యవస్థకు పూర్వ వైభవం రానుందని తెలిపారు. డీలర్లకు చంద్రన్న బీమా వర్తింప చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చొక్కా రామారావు, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి ఎన్.శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎ.రామారావు, విశాఖపట్నం అధ్యక్షులు అప్పలరాజు, మన్యం అధ్యక్షులు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మాధవరావు

ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ

గిరిజన వర్సిటీపై ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్పొరేట్ సంస్థలకు, ధనవంతులకు ఉపయోగపడే భోగాపురం ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ... పేద, ధనిక అనే తేడా లేకుండా విజ్ఞాన్ని అందించే కేంద్రీయ గిరిజన వర్సిటీపై పాలకులు, ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా మంత్రులు చూపడం లేదని జనం చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాకు చెందిన చిన్న తరహా పరిశ్రమల మంత్రి సహా ఎమ్మెల్యేలు, ఎమ్‌పి కూడా ఎయిర్‌పోర్టు పనుల పరిశీలనకు పలు సందర్భాల్లో వెళ్లారు. అంతకు ముందే చేపట్టిన గిరిజన వర్సిటీ పనులను మాత్రం మచ్చుకు కూడా పరిశీలించలేదని జనం వాదన. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 2014లో జిల్లాకు మంజూరు చేసిన ఈ వర్సిటీని రకరకాల కుంటిసాకులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెట్టుకొచ్చింది. 2019 ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ శాశ్వత భవనం గానీ, వర్సిటీ స్థాయికి తగ్గట్టు కోర్సులుగానీ, ఉన్న కోర్సులకు తగినంత అధ్యాపకులను గానీ నియమించలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఎయుకి చెందిన భవనంలో 120 అడ్మిషన్లతో నాడు ప్రారంభమైంది. ప్రస్తుతం 434 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. తగినంతగా తరగతి గదులు లేవు. దీంతో, వరండాలను సైతం తరగతి గదులుగా మార్చారు. కంటైనర్లలో లేబోరేటరీలు ఏర్పాటుచేశారు. అధునాతన పరికరాలు ఉన్నా వాటిని వినియోగంలోకి తేలేని పరిస్థితి దాపురిస్తోందని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విలువైన పుస్తకాలు ఉన్నా ప్రత్యేకించి లైబ్రరీ లేదు. విద్యార్థుల ఆటపాటలకు స్థలం, వ్యాయామశాల కరువవడంతో అంతా కలిసిమెలిసి ఉండడం, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం వంటివి మచ్చుకు కూడా కనిపించని దుస్థితి వర్సిటీలో నెలకొంది. అధ్యాపకులు కూడా తగినంత మంది లేరు. ఇటువంటి పరిస్థితుల్లో మెంటాడ - దత్తిరాజేరు మండలాల సరిహద్దు గ్రామాల్లో తలపెట్టిన యూనివర్సిటీ నిర్మాణ పనులు వేగవంతానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గిరిజన వర్సిటీ నిర్మాణానికి రూ.834కోట్లు కేటాయించారు. 2027నాటికి ఈ పనులు పూర్తిచేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండర్‌లోని మెకాన్ ఇండియా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టింది. రూ.305 కోట్ల వ్యయంతో ఫేజ్ -1 పనులు చేపట్టారు. ప్రస్తుతం చాలా వరకు ల్యాండ్ లెవిలింగ్ పూర్తయింది. నీటి, మట్టి పరీక్షలు పూర్తిచేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన సమావేశంలో కలెక్టర్ చొరవ చూపారనడంలో సందేహం లేదు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరించారు. పనులు సకాలంలో పూర్తికావాలంటే ప్రభుత్వం, ముఖ్యంగా అమాత్యులు ఎంతో చొరవ, నిరంతర పర్యవేక్షణ అవసరం. అధికారులు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదన్నది పబ్లిక్ టాక్.

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: ప్రభుత్వ ఐటిఐలో విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, మణికుమార్ డిమాండ్ చేశారు. పరీక్షలో ఉత్తీర్ణత చేస్తామని చెప్పి అక్రమ వసూళ్లు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో నాణ్యమైన విద్య అందించకపోవడం వల్లనే ఉత్తీర్ణత కోసం డబ్బులు కట్టుకోవాలని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐటిఐలలో నాణ్యమైన విద్యను అందించాలని, అక్రమ వసూళ్లపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ఐటిఐ పరీక్షలు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటిఐలో పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పరిశీలకులు యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి సిసి కెమెరాల పర్యవేక్షణలో ఈనెల 22 నుంచి 30 వరకు పరీక్షలు జరిగినట్లు చెప్పారు. పరీక్షలో ఎటువంటి అక్రమాలు జరగలేదని వెల్లడించారు.

నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

రామభద్రపురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు మండపం నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని స్థానిక ఎస్‌ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందాలని సూచించారు. డీజే సౌండ్ సిస్టంలు, మందుగుండు సామగ్రి వాడకానికి కూడా అనుమతులు ఉండాలన్నారు. ఎన్నిరోజులు మండపాలు నిర్వహిస్తారో ముందుగానే తెలపాలన్నారు. నిమజ్జనాల సమయంలో కమిటీ బాధ్యతగా వ్యవహరించాలని మైనర్లను దూరంగా ఉంచాలని కోరారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదకరంగా వేగావతి

బాడంగి: మండలంలోని పాల్తేరువద్ద వేగావతి నది ప్రవాహాన్ని తహశీల్దార్ సుధాకర్ శనివారం పరిశీలించారు. తుఫాన్, భారీ వర్షాలు వల్ల వేగావతి నదికి వరదనీరు పోటెత్తడంతో ప్రమాద స్థితిలో పొంగిపొర్లుతున్న విషయాన్ని తెలుసుకుని ఎంఆర్‌ఐతో కలసి పాల్తేరు వెళ్లి పరిశీలించారు. అక్కడ నీటి ప్రవాహం ఏవిధంగా ఉంది, ముందస్తు జాగ్రత్తలు ఆ గ్రామ సర్పంచ్ భర్త ఉదయల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, గ్రామస్తులకు సూచించారు. నదిలోకి దిగొద్దని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో దండోరా వేయించి జాగ్రత్తలపై హెచ్చరించాలని సూచించారు. అలజంగి- పాల్తేరు గ్రామాలకు దగ్గర మార్గంగా నదిలో నుంచి రాక పోకలు ఎక్కువగా సాగిస్తున్నందున ఈ ప్రమాద హెచ్చరికలు జారీచేసినట్లు చెప్పారు.

20 కిలోమీటర్ల నడిచి వెళ్లి పింఛన్లు పంపిణీ

వేపాడ: మండలంలోని మారికవలస పంచాయతీ పరిధిలోని కొత్త మారిక, పాత మారిక గ్రామాలకు డిజిటల్ అసిస్టెంట్ డి. ప్రేమ్‌కుమార్ సుమారు 20 కిలోమీటర్లు వర్షంలో నడిచి వెళ్లి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ గ్రామాల్లో సుమారు 70 మంది పింఛనర్లు ఉన్నారు. వర్షం పడుతున్నా ఇన్ని కిలోమీటర్లు నడిచివెళ్లి రావడంపై ఆయన బొదాన్యానికి గ్రామస్తులు, అధికారులు అభినందనలు తెలిపారు.



నడిచి వెళుతున్న డిఎ

అవసరమైన ఎరువులు అందించాలి

వేపాడ: జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాట్లు వేసి ఎరువులు వేసేందుకు అనుకూలంగా ఉన్నందున రైతులకు వెంటనే ప్రభుత్వం ఎరువులను అందించాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. డిఎపి, యూరియా ఎరువులు అనేక సేవా కేంద్రాల్లో దొరకడం లేదని దీంతో ప్రయివేటు ఎరువుల దుకాణాలకు వెళ్లి చేతి చమురు వదిలించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు వద్ద అందుబాటులో ఉంచాలన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

బొండపల్లి: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్ కోరారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ సమూదాయం వద్ద వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి దగ్గర బయలుదేరినప్పటి నుంచి చివరకు గమ్య స్థానం చేరేవరకు తలకు హెల్మెట్ ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హెల్మెట్ పట్ల చాలా మంది నిర్లక్ష్యం చూపుతున్నారని, వాహనం చేసేటప్పుడు మన పైన కుటుంబం ఆధార పడి ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ వాహన తనిఖీ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అట్టాడి వెంకట్రావు, కార్యదర్శి మంధా సుబ్బారావుల ఆధ్వర్యంలో ఎస్ కోట పంచాయతీలో పనిచేస్తున్న 71 మంది పారిశుధ్య కార్మికులకు బట్టలు, స్వీట్లు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ 'చావా అక్షత్ అహనా, మంథా సంధ్యల సౌజన్యంతో బట్టలు, స్వీట్స్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం స్నేహ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులైన మంధా సంధ్య స్నేహ మెంబర్‌గా చేరారు. ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు విస్సకోట శ్రీరామమ్మూర్తి, పొట్నూరు శ్రీరాములు, ప్రసాద్, ఎం. ప్రకాష్, హరీష్, స్నేహ స్వచ్ఛంద సంస్థ కోశాధికారి కె .గణేష్, కొమ్ము శ్రీను, మద్దల శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

శృంగవరపుకోట: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ధర్మవరం పాఠశాల విద్యార్థి వెదురుపర్తి వరప్రసాద్‌కు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం చేయూతనందించారు. ఈ నెల 29న ఒంగోలు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ పొందిన వరప్రసాద్ శనివారం పాఠశాల హెచ్‌ఎం బి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులను కలిశాడు. ఈ సందర్భంగా విద్యార్థి వరప్రసాద్‌ను ఆశీర్వదిస్తూ ట్రిపుల్ ఐటీ కోర్సు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. అనంతరం వరప్రసాద్‌కు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంపడాపు ఈశ్వరరావు, హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకులు లోహం షేక్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని వినతి

రేగిడి: మండలంలోని గుల్లపాడు పంచాయతీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ముంజేటి అలివేలు మంగమ్మ కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమెను విధులనుంచి తొలగించాలని ఎంపిడిఓ. శ్యామల కుమారికి గ్రామస్తులు శనివారం వినతిని అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులు పనులకు వెళ్లకుండా వారికి మస్తర్లు వేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దళిత కాలనీలో ఉన్న అర్హులైన దళితులకు జాబు కార్డులు మంజూరు చేయకపోవడంతో వారు వలస బాటను పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విచారణ వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ అలివేలు మంగమ్మపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

కొత్తవలస: మండల కేంద్రంలో స్థానిక వినాయక నగర్ వద్ద ఉన్న ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం దత్తి గ్రామానికి చెందిన కలగా శ్యామ్ ఉమామహేశ్వర పాత్రుడు భవాని దంపతులు ప్రథమ పుత్రుడు కీర్తి శేషులు జగన్ పాత్రుడు పండు ఒకటవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు స్నేహితులు ఆర్థిక సహాయంతో 42 మంది ఒంటరి వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరావు కుటుంబ సభ్యులు ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాత్రుడు కుటుంబ సభ్యులు స్నేహితులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా రామారావు

రామభద్రపురం: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రేషన్ డీలర్ల సర్వసభ్య సమావేశంలో మండల కేంద్రానికి చెందిన చొక్కాపు రామారావును జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 300 మంది డీలర్లు హాజరై జిల్లా నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొణిదం ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా ముత్యాల నాయుడు, కార్యదర్శులు రామలింగేశ్వరరావు, గోపీ కృష్ణ, ఉప కార్యదర్శిగా గౌరిని ఎన్నుకున్నారు.

తాటిపూడికి గొర్రెపాటి పేరు పునరుద్ధరించాలి

శృంగవరపుకోట: తాడిపూడి రిజర్వాయర్‌కు స్వాతంత్ర సమరయోధులు కీర్తిశేషులు గొర్రెపాటి బుచ్చిఅప్పారావు జలాశయంగా నామకరణం పునరుద్ధరించాలని పుణ్యగిరి వెలమ సంక్షేమ నాయకులు శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంట్యాడ మండలం తాటిపూడి గ్రామంలో నిర్మించిన తాటిపూడి జలాశయం నిర్మాణానికి రైతులందరినీ ఐక్యం చేసి రైతుల ఆశయాలకు పోరాటసల్పిన పోరాడి సాధించిన స్వర్గీయ కీర్తిశేషులు గొర్రెపాటి బుచ్చి అప్పారావు అని గుర్తు చేశారు

కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేత

బొబ్బిలి: టిడిపి యాప్‌లో చురుగ్గా పని చేసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే బేబీనాయన ప్రశంసా పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి అధిష్టానం ఏర్పాటు చేసిన యాప్‌లో చురుగ్గా పని చేసిన ఆరుగురు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పార్టీ కోసం పని చేసిన వారికి మంచి గుర్తింపు వస్తుందన్నారు.

నర్స్‌కు ఎసి గది కేటాయించడం ఏంటి?

● సిహెచ్‌సిలో ఆమెదే పెత్తనం ● ఆమె చెప్పిన వారికే సెలవులు ● సూపరింటెండెంట్ వింత పోకడపై కౌన్సిల్ సభ్యుల ధ్వజం ● చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎక్కడా లేని విధంగా ఒక నర్సు కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏసీ గది కేటాయించడం ఏంటి? ఆమెను సిబ్బందితో సహ వైద్యులకు కూడా సెలవులు ప్రకటించే స్థాయిలో పెట్టడం ఏంటి? సిహెచ్‌సిలో ఆమె పెత్తనానికి పునాది వేసిన సూపరింటెండెంట్ పరిస్థితి ఏంటి అని సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిన అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిల్ సభ్యులు సిహెచ్‌సి సూపరింటెండెంట్ తీరుపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. సిహెచ్‌సిలో ఒక నర్స్‌కి ప్రత్యేక గది కేటాయించి ఆ గదికి ఏసి కూడా ఏర్పాటు చేసి మిగతా వారిపట్ల వివక్ష చూపించడం ఎంత వరకూ సబబు అని ప్రశ్నించారు. సదరు నర్స్ చెప్పిన వారికే సెలవులు కూడా మంజూరు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నర్సు, సూపరింటెండెంట్ ఇద్దరూ ఉదయం సిహెచ్‌సికి వచ్చి బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం వరకూ రావడం లేదని ఆరోపించారు. సీజనల్ వ్యాధులు ప్రబలతున్న సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోతే ఎలా అని మండిపడ్డారు. ఆస్పత్రిని భ్రష్టు పట్టిస్తున్న సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పోరాటం చేస్తామని కొంత మంది కౌనిల్సర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానని వైద్యులంతా ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని, ప్రయివేటు కార్యక్రమాలు ఏమైనా ఉంటే బయట చూసుకోవాలి తప్ప ఆస్పత్రి వరకూ రాకూడదని హెచ్చరించారు.

పలు సమస్యలపై ధ్వజం

పోలీస్ స్టేషన్ వద్ద గ్రామ కంఠం భూమికి పన్ను వేసి అదే స్థలానికి రిజిస్ట్రేషన్ పనుల జరుగుతున్నాయని, మొయిద జంక్షన్ సినిమా హాల్ వద్ద అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తులు భవనం నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని, దాని మీద నిగ్గు తేల్చి తగు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. జ్యూట్ మిల్ విషయంలో యాజమాన్యం మిల్లు మూసి వేసి కార్మికులకు ఇబ్బంది పెడుతుందన్నారు. వారి వాటాగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఇఎస్‌ఐ, పిఎఫ్ బకాయిల కట్టకుండా నిర్లక్ష్యం వహించి కోట్లాది రూపాయలు పన్ను నగర పంచాయతీకి చెల్లించలేదని జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 7వ వార్డులో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయే తెలియని పరిస్థితిలో ఉన్నాయని పలు మార్లు విద్యుత్ అధికార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నగర పంచాయతీలో వీధి దీపాల సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యల పై ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ఎమ్మెల్యే ఆదేశాలంటే గౌరవం లేదా?

కౌన్సిల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు నిలదీత

బొబ్బిలి: ఎమ్మెల్యే బేబినాయన అదేశాలంటే గౌరవం లేదా అని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మున్సిపల్ అధికారులను టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ రాంబార్కి శరత్ నిలదీశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత ఎమ్మెల్యే ఆదేశాలను గౌరవించినప్పటికి నేడు ఎమ్మెల్యే బేబినాయన ఆదేశాలను ఎందుకు గౌరవించడం లేదని ప్రశ్నించారు.

వైసిపి ప్రభుత్వం అధికారంలో ఎమ్మెల్యే శంబంగి కోరిన పనులకు మున్సిపల్ సాధారణ నిధులు కేటాయిస్తే తాము ఎటువంటి అభ్యంతరం తెలపకుండా మద్దతు ఇచ్చామని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పూల్ బాగ్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరితే ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేయడం బాధాకరమన్నారు. బొబ్బిలిలో ఏర్పాటు చేసిన రిలీయన్స్ మార్ట్ ప్రారంభానికి ఎటువంటి ఆహ్వానాలు కౌన్సిలర్లకు ఇవ్వలేదంటే వారు ఇచ్చిన గౌరవాన్ని అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. ఐదో వార్డు శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కౌన్సిలర్లను పిలవకుండా కాంట్రాక్టర్లు వివక్షత చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు లేకుండా సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

ఫార్మా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విశాఖపట్నంలోని ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పూసపాటిరేగ శివారు గ్రామీణ గొల్లపేటలో బమ్మిడి ఆనందరావు కుటుంబాన్ని శనివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పరామర్శించారు. మృతుని భార్య సత్యవతి, పిల్లల్ని ఓదార్చారు. అవకాశం బట్టి తనకు ఉద్యోగం కల్పించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లల్ని జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి ఏంటని జనసేన నాయకుడు మహంతి శివని అడిగి తెలుసుకున్నారు. వారికి రావలసిన ధ్రువీకరణ పత్రాలన్నీ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపాడు. పరిహారంగా వచ్చిన కోటి రూపాయలు చెక్కుని క్యాష్‌గా మార్చుకొని భవిష్యత్తు అవసరాలకు దాచుకోవాలని ఆమె సూచించారు. ఆమెతోపాటు జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, మండల నాయకులు పతివాడ శ్రీను, బాల అప్పలరాజు, సంక భక్తుల సత్తిబాబు, టిడిపి నాయకులు పిడిఎ ప్రసాద్, పిన్నింటి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి అందించిన ముస్లింలు

ఎమ్మెల్యే లోకం మాదవికి పూసపాటి రేగలో హైవే ఆనుకొని నివాసాలు ఏర్పరచుకున్న ముస్లిం మైనార్టీకి చెందిన 20 కుటుంబాలు వినతిపత్రం అందజేశారు. హైవే ఆనుకుని ఉన్న తమ నివాసాలను తొలగించాలంటూ హైవే అధికారులు నోటీసులు జారీ చేశారని ఆమె ముందు వాపోయారు. దానికి ఆమె స్పందించి మీకు స్థలాలు మంజూరు చేసేంతవరకు అక్కడే ఉండేటట్లు హైవే అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. దాదాపుగా జనవరిలో శాశ్వతంగా ఉండే ఇండ్ల స్థలాలను ఇచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. అప్పటివరకు మీరు నివాసాలు ఉండొచ్చని తెలిపారు.

పార్టీ పటిష్టతకు మరింత కృషి

బాడంగి: టిడిపి పటిష్టతకు మరింత కృషి చేస్తానని టిడిపి బీసీ సాధికారత జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. మన టిడిపి యాప్ ద్వారా కంటెంట్‌ను షేర్ చేయడంలో ప్రథమ స్థానంలో నిలిచిన తనను గుర్తించి అభినందించిన పార్టీకి రుణపడి ఉంటానని చెప్పారు. శనివారం బొబ్బిలిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటో అందుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మునుపటి లాగే పార్టీ ఉన్నతికి శక్తివంచన లేకుండా కష్టపడతానని చెప్పారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. మన టిడిపి యాప్‌లో మొత్తం 14 క్యాటగిరిలకు గాను 12 క్యాటగిరిలను ఇప్పటికే పూర్తి చేశానని, మిగతా రెండు త్వరలో పూర్తి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబీ నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కొల్లి



ఇంటి పట్టాను అందజేస్తున్న తహశీల్దార్ ఆదిలక్ష్మి

కలెక్టర్ ఆదేశాలతో ఇళ్ల పట్టా మంజూరు

ప్రజాశక్తి- గుర్ల

మండల కేంద్రంలో శనివారం పింఛన్ల పంపిణీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కొండపల్లి సుమతి అనే మహిళ కలిసి తనకు అర్హత ఉన్నా గత ప్రభుత్వంలో ఇళ్ళ పట్టా మంజూరు చేయలేదని విన్నవిస్తూ దరఖాస్తును సమర్పించారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అక్కడే ఉన్న తహశీల్దార్ ఆదిలక్ష్మికు తన పర్యటనకు మీరు రావద్దని, ఇక్కడే ఉండి ఈమె దరఖాస్తును పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. వెంటనే తహశీల్దార్ దరఖాస్తును పరిశీలించి అర్హత ఉందని గుర్తించి వెంటనే కొండపల్లి సుమతికి పట్టాను అందజేసినట్లు తహశీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. సమస్య సత్వరమే పరిష్కరించడంతో సుమతి హర్షం వ్యక్తం చేశారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ మండలంలో ప్రభుత్వ భూముల కబ్జాపై స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు తెలిపారు. మండలంలో విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేజీ పూడి రెవెన్యూ పరిధిలోను, వీలుపర్తి పరిధిలో వందలాది ఎకరాలు డిపటా, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు ప్రజా దర్బార్లో సమర్పించిన దరఖాస్తు పై శనివారం తనను కలెక్టర్ తన కార్యాలయానికి పిలిచి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను అడిగి తెలుసుకున్నట్లు అప్పారావు తెలిపారు. తాను చేసిన ఫిర్యాదుపై పరిశీలించి నిధులు కోసం ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపిస్తానని కలెక్టర్ చెప్పినట్లు తెలిపారు. సామాజిక కార్యకర్తగా సామాజిక సమస్యలపై కార్యాలయం పని వేళలో తనను ఎప్పుడు కలిసిన అందుకు ఏ విధమైన అభ్యంతరం లేదని కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక ప్రతిమలకు పూజలు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక తారక రామకాలనీలో శనివారం అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల కాలుష్యాన్ని నివారించేందుకు మట్టివినాయక విగ్రహాలకు పూజలు చేయాలన్నారు. రాణిమల్లమ్మదేవి పార్కు కోనేరు చుట్టూ వున్న ప్రజలకు 2వేలు మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేసి జల కాలుష్యం నివారణకు కృషి చేస్తున్నామని అభిమాని ఫౌండేషన్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాల్ చెప్పారు. కార్యక్రమంలో స్పాక్ సొసైటీ సంస్థ అధ్యక్షులు పద్మనాభం, మాజీ కౌన్సిలర్ సుంకరి సాయిరమేష్, అవేర సంస్థ అధ్యక్షులు పెద్దింటి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి। భోగాపురం

భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పశు వైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వై.వి రమణ అన్నారు. మండలంలోని ముంజేరు గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఆయన పర్యటించారు. వర్షాకాలంలో పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే పశు వైద్యులను కలవాలని రైతులకు ఆయన సూచించారు. గాబువానిపేట గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వేణుమాధవ్, ముంజేరు పశువైద్యాధికారి డాక్టర్ యు.రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మా అబ్బాయి మృతిపై అనుమానాలున్నాయి?

ప్రజాశక్తి - కొత్తవలస

' మా అబ్బాయి రాధాకృష్ణ మృతి పై అనుమానాలున్నాయని పోలీస్‌లు న్యాయ విచారణ చేసి మాకు న్యాయం చేయాలని రాధాకృష్ణ తల్లిదండ్రులు దుక్క అప్పలరాజు, అరుణ దంపతులు శనివారం కొత్తవలస సిఐ, జిల్లా ఎస్‌పికి వినతి పత్రాన్ని అందించారు. తమ కుమారుడు గత నెల 10వ తేదీన తాను చేస్తున్న లారీ క్లీనర్ పనికి వెళ్లాడని అనుకున్నామని, కానీ తన వెళ్లకుండా గత నెల 25వ తేదీన శవమై కనిపించాడని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమారుడుది ముమ్మాటికి హత్యేనని ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు పై జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ స్పందిస్తూ న్యాయం చేస్తామని ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని సిఐకు ఆదేశించారు. దీనికి ముందుగా 150 మంది బాధితుని కుటుంబానికి మద్దతుగా కొత్తవలస పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా ఎస్‌పి ఆఫీసుకి వెళ్లి మెమోరాండం సమర్పించారు.

ఎస్‌పి, సిఐకు తల్లి దండ్రుల వినతి



సిఐకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

2 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో సెప్టెంబర్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యంగా ఈ సదస్సుల్లో రీసర్వేలో వచ్చిన తప్పులను సరిచేయడం, పాసుపుస్తకాల్లో వచ్చిన వివిధ సమస్యలపై చర్చిస్తామన్నారు. మండలంలో 32 రోజులపాటు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూరి గుడిసెలు, మిద్దె ఇళ్లల్లో ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని తెలిపారు.

సూపర్‌వైజర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి। బాడంగి

ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్‌గా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ పొందిన సురగాల చిట్టమ్మను శనివారం ఐసిడిఎస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి చేతుల మీదుగా చిట్టమ్మ దంపతులకు దుస్సాలువాతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తను చేస్తున్న వృత్తిలో నిమగ్నమై రాజకీయ ఒత్తిడిలను తట్టుకొని పనిచేశారన్నారు. తన శేష జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - వంగర


మండలంలోని తలగాం గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పైల నారాయణరావు (52) అనారోగ్యంతో మృతి చెందాడు. రేగిడి ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఈయన గత కొన్ని రోజులుగా కాలేయం సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నంలో గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం రాత్రి ఆయన అక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం తలగాం తీసుకురావడంతో రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది, మృతదేహం వద్దకు చేరుకొని మృతుడు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు దహన సంస్కరణల ఖర్చుకు సంబంధించి భార్య పార్వతికి రూ.25 వేలు అందించారు. మృతునికి భార్య పార్వతితో పాటు కుమారుడు సాయి(24), కుమార్తె శిరీష (22) ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

నెల్లిమర్ల: అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ముగ్గురు సెంచూరియన్ విద్యార్థులకు 3 బంగారు, 3 వెండి పతకాలు లభించాయి. సెంచూరియన్ క్లబ్ విద్యార్థి వి.రమాదేవి సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం, జూనియర్ స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించింది. సీనియర్ విభాగంలో బిబిఎ విద్యార్థి శ్రీలక్ష్మి బంగారు పతకం సాధించింది. మరో బిబిఎ విద్యార్థి శ్రీపాద శ్రీజ తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యూత్ పోటీల్లో బంగారు, జూనియర్ విభాగంలో వెండి, సీనియర్ విభాగంలో మరో వెండి పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, కోచ్ అర్జున్, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేయాలి


బొబ్బిలి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను ద్రోహం చేసే ఏకీకృత పెన్షన్ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మరల అధికారంలోనికి వచ్చిన కేంద్ర ప్రభుత్వం పాతపెన్షన్ అమలు చేయకుండా సిపిఎస్ కంటె ప్రమాదకరమైన యుపిఎస్‌ను తీసుకురావడం అంటే ప్రపంచ మార్కెట్లో బడా వ్యాపారులకు అప్పనంగా పెన్షన్ నిధులను వారి వ్యాపారం కోసం పెట్టుబడి పెట్టడమేనన్నారు. ఇక్కడ రాష్ట్రంలో గ్యారంటీ పెన్షన్ పథకాన్ని కూడా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రక రకాల పథకాలను తెచ్చి ఇవే పాత పెన్షన్‌కు ప్రత్యామ్నాయం అనడం దుర్మార్గమన్నారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం తప్ప వేరే పథకాలను అంగీకరించబోమని అన్నారు. యుపిఎస్ వల్ల జరిగే నష్టాలను వివరించారు.



భోగాపురం: పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి



వికలాంగునికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



వంగర: వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ




గుర్ల: వృద్ధునికి పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

పలు చోట్ల పింఛన్ల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా శనివారం పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పలు చోట్ల ఎమ్మెల్యేలు నేరుగా పాల్గొని పింఛన్లను పంపిణీ చేయగా మరి కొన్ని చోట్ల అధికారులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులతో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

-ప్రజాశక్తి, యంత్రాంగం



డెంకాడ: పింఛను అందిస్తున్న నాయకులు నాగార్జున, బంగార్రాజు